క్లుప్తంగా

5న వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినియోగదారుల రక్షణ నూతన చట్టం–2023లోని యాక్టు–35పై ఈ నెల 5న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయమూర్తి పి.జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. పీఎన్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద జరిగే ఈ సదస్సుకు అందరూ హాజరుకావాలని కోరారు.

నేడు 'రైతేరాజు' నాటిక ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో జూలై 1న కళాంజలి హైదరాబాద్ వారిచే 'రైతేరాజు' నాటిక ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు చిట్టి వెంకటరావు, రామచంద్ర దేవ్, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: గుజరాతిపేట సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ భయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోత ఉంటుందని పేర్కొన్నారు. పీఎన్ కాలనీ, కుశాలపురం, నవభారత్, వెంకటాపురం, తోటపాలెం, కొత్తపేట, పొన్నాడ పంచాయతీ, ఇబ్రహీంబాద్, తమ్మినాయుడుపేట, సనపలవానిపేట, ఫరీదుపేట ప్రాంతాల్లో కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అరసవల్లి: శ్రీకాకుళం–ఆమదాలవలస ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు, గూడెం, వాకలవలస, లంకాం, బావాజీపేట, చంద్రయ్యపేట, ఎం.మన్నయ్యపేట, లింగాలవలస, మెట్టపేట తదితర గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురంలో షిరిడిసాయి దర్బార్‌లో జరుగుతున్న గురుపూజోత్సవంలో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ ఆధ్వర్యంలో దుర్గాహోమం జరిగింది.

బీజామృతం తయారీపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్ : జరజాం గ్రామ రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో మెలకువలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆవు పేడ, ఆవు మూత్రం, సున్నంతో బీజామృతం తయారు చేసే విధానాన్ని వివరించారు. భూసారం, తెగుళ్ల నియంత్రణకు బీజామృతం ఉపయోగపడుతుందని చెప్పారు. శిక్షకులు మెట్ట ధనుంజయ్, సువ్వారి సన్యాసిరావు, హరే రామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

గార: విత్తనాలకు శ్రీరామరక్షగా బీజామృతం పనిచేస్తుందని డీపీఎం రేవతి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం పంచాయతీలో శిమ్మపేట మహిళా సంఘ సభ్యులకు బీజామృతం తయారీ విధానం, ప్రకృతి వ్యవసాయంపై సేంద్రియ ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ వరి విత్తనాలను శుద్ధి చేయాలన్నారు. అనంతరం బీజామృతం తయారు చేసే విధానం వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ శివాజీ, శ్రీనివాస్, శోభన్‌బాబు, ఇంఛార్జి గున్నమ్మ, ఐసీఆర్‌పీ ప్రమీల, లీడ్ రైతు రుప్ప లలిత తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మారు రథయాత్ర



రథయాత్ర ఉత్సవంలో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుజరాతిపేటలోని గుడిశనగుళ్ల వద్ద పది రోజులుగా జరిగిన రథయాత్ర ఉత్సవం శుక్రవారం తిరువీధి ఉత్సవంతో ముగిసింది. మారు రథయాత్రలో భాగంగా సుభద్ర, బలభద్రల సమేత శ్రీజగన్నాథస్వామి మూర్తులను రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేర్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టమాటా @100

- ప్రతికూల వాతావరణ పరిస్థితులతో తగ్గిన దిగుబడి
- వినియోగం మేరకు సరిపడని దిగుమతులు
- రైతుబజారులో త్వరలో ప్రత్యేక కౌంటర్లు



శ్రీకాకుళం: టమాటా మోత మోగింది. జిల్లాలో కిలో ధర రూ.100కు చేరుకుంది. 20 రోజుల క్రితం కిలో ధర రూ.20 ఉండగా ఇపుడు రూ.100 పలుకుతోంది. ఒకటి రెండు చోట్ల రూ.90కు విక్రయిస్తున్నా ఎక్కువ మంది మాత్రం వందకు తగ్గడం లేదు. రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కిలో రూ.50కు విక్రయించాలని ప్రభుత్వం గురువారం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించేందుకు దాచిపెట్టిన సరుకును తీసి కొంతమేర ధరతగ్గించి విక్రయించారు. జిల్లాలో రోజుకు 80 నుంచి 100 టన్నుల టమాటా విక్రయిస్తున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో ఇంతటి దిగుబడి ఉండక పోగా వేసవికాలంలో శ్రీకాకుళం జిల్లాలో టమాటా పండించలేదు. దీంతో దిగుమతిపైనే ఆధారపడుతున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ వంటి రాష్ట్రాల నుంచి టమాటా ఎక్కువగా దిగుమతి అవుతోంది. ఆయా రాష్ట్రాలలో అకాల వర్షాలు, తీవ్రమైన ఎండల కారణంగా పంట బాగా దెబ్బతింది. ఈ కారణంగానే ఒక్కసారిగా ధర పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పచ్చిమిర్చి, అల్లం ధర కూడా విపరీతంగా పెరిగిపోయింది. కిలో పచ్చిమిర్చి రూ.90 నుంచి రూ.100 వరకు ఉండగా, అల్లం మొదటిరకం కిలో రూ.200, రెండో రకం రూ.150 ఉంది. ఇవి కూడా ఇతర రాష్ట్రాల నుంచే దిగుమతి అవుతున్నాయి. వర్షాలుపడితే జిల్లాలోనే టమాటా, పచ్చిమిర్చి అవసరం మేరకు కాక పోయినా 50 శాతం వరకు దిగుమతి అయ్యే అవకాశముంది. అప్పటి వరకు రేట్లు తగ్గే పరిస్థితి కనిపించడంలేదు. ఇతర రాష్ట్రాలలో ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ ధర ఇంతగా పెరగలేదు. కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడంతో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. విజిలెన్స్, పోలీసు, మార్కెటింగ్ శాఖలు ఈ విషయంపై దృష్టి సారించి కృత్రిమ కొరత లేకుండా చేస్తే ధర కొంత మేరకు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఒకటి రెండు రోజులలో రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి టమాటా కిలో రూ.50కే విక్రయించే అవకాశముంది.

ప్రత్యేక కౌంటర్లు..



> రైతుబజార్లలో ప్రభుత్వ నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు త్వరలోనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి తగ్గడం వల్లే ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి.
>
> – ఎం.కాశేశ్వరరావు, మార్కెంటింగ్ ఏడీ

ప్రజల చెంతకే పాలన

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిరణ్



పైడిభీమవరంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, సతీమణి పరిమళ

రణస్థలం: నిరంతరం ప్రజలతో మమేకమవుతూ జనంలో నుంచే పరిపాలన సాగించే ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. సతీమణి, మాజీ ఎంపీపీ గొర్లె పరిమళతో కలిసి శుక్రవారం రణస్థలం మండలం పైడిభీమవరంలో గడపగడపకు – మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో కలిగిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరు చేయాలని పలువురు విన్నవించగా, అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంటిల్లపాదికి సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని, పథకాలన్నీ కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్ననే మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ పరిమళ మాట్లాడుతూ పథకాల మంజూరులో మహిళలకే అగ్రపీఠం వేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ చేయూత, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, జగనన్న వసతి దీవెన మహిళలకే అందిస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, పిల్ల ఆనందరావు పాత్రుడు, చినరామినాయుడు, పైడిభీమవరం ఎంపీటీసీలు ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు, గ్రామ నాయకులు అల్లంపల్లి బాషా, నారాయణప్పారావు, దాట్ల సురేష్, పిప్పళ్ల వెంకటేష్, డీఎల్‌పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

శ్రీకాకుళం రూరల్: మండలంలోని నైరా గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సమస్యల పరిష్కారం, ధ్రువపత్రాల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు.

గార: మండలంలోని బూరవెల్లి, వాడాడ పంచాయతీ సచివాలయాల వద్ద శనివారం జగనన్న సురక్షపై సమావేశాలు జరుగుతాయని ఎంపీడీఓ సంజీవ రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజులుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పలు రకాల ఉచిత సేవలపై వివరాలు సేకరించారని పేర్కొన్నారు. బూరవెల్లిలో తహసీల్దార్ జెన్ని రామారావు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఆయా పంచాయతీల ప్రజలు తప్పకుండా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఆకట్టుకున్న 'జానపద నృత్యాలు'



నృత్యాల ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురం సాయిదర్బార్‌లో జరుగుతున్న గురుపౌర్ణమి ఉత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం 'జానపద నృత్యాల' ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. విజయనగరానికి చెందిన రేల రేలారే బృందం పలు జానపద గీతాలకు చక్కనైన నృత్యాలు ప్రదర్శించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఆరోగ్య భరోసా



చీడిపేటలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

జి.సిగడాం: ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పల్లె ప్రజలకు ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని జి.సిగడాం వైద్యాధికారి యశ్వంత్ అన్నారు. శుక్రవారం చీడిపేట, మద్రివలస గ్రామాల్లో పేదలకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి, 104 వైద్యులు సురేష్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ భాస్కరరావు, ఏఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏటిమాగను పరిశీలించిన అధికారులు



సముద్రతీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పెదగనగళ్లవానిపేట పంచాయతీ పరిధిలో సముద్రతీరం వెంబడి నాగావళి నదిను ఆనుకొని ఉన్న ఏటిమాగను అధికారుల బృందం పరిశీలించారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే పెదగనగళ్లపేటలో ఏటిమాగకు తక్షణ పరిష్కారం చూపించాలంటూ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ ఈఈ సుధాకర్, తహసీల్దార్ ఎస్.వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది సముద్ర తీరం వెంబడి ఉన్న ఏటిమాగను పరిశీలించారు. అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మాజీ సర్పంచ్ చీకటి గురుమూర్తి, సర్పంచ్‌లు గంగు నరేంద్రకుమార్, సూరాడ సూర్యం, మత్స్యకార నాయకులు మైలపల్లి పోలీస్, కొమర గురుమూర్తి, వారాది ఆదినారాయణ, మైలపల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు సిద్ధం



నూతన అధ్యక్షుడు రవికుమార్, సభ్యులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సమాజంలో సమస్యలను గుర్తించి శక్తియుక్తుల మేరకు బడుగు, బలహీన వర్గాలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు క్లబ్ నూతన అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. శుక్రవారం క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యాలయంలో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లడు సమాజహితమైన కార్యక్రమాలు నిర్వహించి జిల్లాలోనే అత్యున్నత సేవా క్లబ్‌గా నిలపడానికి కృషి చేయడంలో ప్రతి లయన్ సభ్యుడు సహకరించాలని కోరారు. లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా పొన్నాడ రవికుమార్, కార్యదర్శిగా టెక్కం రామ్‌గోపాల్, కోశాధికారిగా శిల్లా మణి, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, ఎంకే మిత్రో, క్లబ్ మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా కోట నాగేంద్రభూపతి నాయుడు, ఎల్‌సీఐఎఫ్ కో–ఆర్డినేటర్‌గా పూర్వ అధ్యక్షులు డాక్టర్ బాడాన దేవభూషణరావు, సర్వీస్ చైర్‌పర్సన్‌గా బరాటం ఆంజనేయులు, మార్కెటింగ్ కమ్యూనికేషన్ చైర్‌పర్సన్‌గా చదువులు ఈశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్‌గా గొద్దు రామకృష్ణ, డైరక్టర్లుగా జోగి భారతి, డబ్బీరు వాసు, కిల్లి అప్పారావు మాస్టారు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు, వ్యాపారవేత్త అంధవరపు ప్రసాద్, ఊన్న కిరణ్, బరాటం విశ్వేశ్వర రావు, బరాటం మాధురి తదితరులు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సీపాన రమేష్ కుమార్, భగవత్ సింగ్, కృష్ణ కాంత్, దీర్ఘాసి తిరుమలరావు, చరణ్, సునీల్, రామ్మోహన్ పట్నాయక్, నటుకుల కిరణ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని, అర్హులై ఉండి పథకాలు అందకపోతే వివరాలు నమోదు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో లంకాం, వాకలవలస పంచాయతీలకు చెందిన వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, చిట్టి జనార్దనరావు, చిట్టి రవికుమార్, చల్లా రాజారావు, నక్క శంకర్, బగాది మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో పనిచేస్తే ఉజ్వల భవిష్యత్



అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌లో 39 మందికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత

రణస్థలం: రసాయన పరిశ్రమల్లో ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తే ఉత్పత్తి సామర్థ్యాలు సైతం పెరుగుతాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. రణస్థలం మండలంలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ పరిశ్రమలో 39 మంది బీఎస్సీ గ్రాడ్యుయేట్లను కెమిస్టులుగా ఎంపిక చేశారు. వీళ్లకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలో ఏ ఉద్యోగైనా కింది స్థాయి నుంచే పైకి వస్తారని చెప్పారు. తాను పరిశ్రమలో పని చేసినప్పుడు నెలకు రూ.18 వేలు జీతం ఇచ్చేవారని గుర్తు చేశారు. ఎక్కడైనా కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునని తెలిపారు.

ఎమ్మెల్యే కిరణ్ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరాక అంకితభావంతో పనిచేయాలన్నారు. అంతే తప్ప లోకల్ అంటూ నచ్చినప్పుడు పనికి వస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తారని, ఆ తర్వాత తమను ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. పరిశ్రమ ప్రతినిధి కేవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే కిరణ్ విజ్ఞప్తి మేరకు 87 మంది బీఎస్సీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. వారికి రసాయనిక పరిశ్రమకు సంబంధించి నైపుణ్య శిక్షణ ఇప్పించగా 39 అర్హత సాధించారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంకలపల్లి ప్రసాద్, పైడిభీమవరం ఎంపీటీసీలు ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు, రెడ్డీస్ ప్రతినిధులు దీపక్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 35 కుటుంబాల చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు టీడీపీ శ్రేణులు సైతం ఆకర్షితులవుతున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం ఎన్‌జీఆర్‌పురం పంచాయతీకి చెందిన 35 టీడీపీ కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కిరణ్ పార్టీ కండువాలు వేసి వేశారు. పార్టీలో చేరిన వారిలో పోతయ్యపేట, గురయ్యపేట, చీకటిపేట గ్రామాలకు చెందిన సూర్యనారాయణ(పొట్టోడు), మైలపల్లి వీరపన్న, ఉప్పాడ అప్పయ్యమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మైలపల్లి కామరాజు, మహంతి చినరామినాయుడు, గొర్లె అప్పలనర్సు నాయుడు, లంకలపల్లి గోపి, బడి రాంబాబు, ఎన్‌జీఆర్ పురం, మరువాడ సర్పంచులు మైలపల్లి పైడమ్మ, జక్కంపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ ఉప్పాడ అప్పన్న, నాయకులు మైలపల్లి పిల్లతాత, జక్కంపూడి బంగార్రాజు, అప్పలరాములు, చీకటి పున్నం, కొమర కొర్లయ్య, జిగిరి రాంబాబు, రమణ, కొమర కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా గృహ నిర్మాణ పనులు



రికార్డులను పరిశీలిస్తున్న డీఈఈ అప్పారావు

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన జగనన్న గృహాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆ శాఖ డీఈఈ కె.అప్పారావు అన్నారు. శుక్రవారం పాలఖండ్యాం, జి.సిగడాం గ్రామాల్లో గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో 10,951 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిలో 5585 ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని చెప్పారు. 646 గృహాలు ఆర్‌సీ, 613 గృహాలు ఆర్‌ఎల్, 1169 గృహాలు బీఎల్ స్థాయిలో ఉన్నాయని వివరించారు. జి.సిగడాం మండలంలో 1360 గృహాలకు గాను 802 ఇళ్లు పూర్తయినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన వెంటనే బిల్లులు చెల్లింపు చేస్తున్నామన్నారు. అనంతరం బిల్లుల రికార్డులను పరిశీలించారు. ఏఈఈ మహదాసుల రమేష్, సిబ్బంది యువరాజ్, శ్రీనివాసరావు, సురేంద్ర పాల్గొన్నారు.

శాకంబరి అవతారంలో సంతోషిమాత



శ్రీకాకుళం కల్చరల్: శాకంబరీ అవతారంలో సంతోషిమాత



లావేరు: శాకంబరిగా కనకదుర్గ అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారు శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ నేతృత్వంలో ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని పలు రకాల కూరగాయలతో అలంకరించారు. అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో శ్రీచక్ర పూజలు చేశారు.

లావేరు: లావేరు కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని శాకాంబరీదేవీగా అలంకరించారు. అర్చకులు నేతేటి రుషికుమార్‌శర్మ వివిధ కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

రిటైనింగ్ వాల్ పనులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్ : ముద్దాడ గ్రామంలోని ఊటగెడ్డ వరద నీరు నియంత్రణకు చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను శుక్రవారం ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ప్రారంభించారు. ఏటా వరదల సమయంలో నీటి ప్రవాహం పెరగడంతో ఇక్కడ పొలాలు కోతకు గురవుతున్నాయి. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా నిధులు మంజూరు చేశారు. అనంతరం గ్రామంలో శుక్రవారం జగనన్న భూరక్ష పథకంలో భాగంగా సమగ్ర సర్వే ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, సర్పంచ్ ముద్దాడ శంకర్, నాయకులు బెండు రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ పనితీరుపై సభ్యుల ఆగ్రహం



విద్యుత్ ఏఈపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ ప్రజాప్రతినిధులు

లావేరు: ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన శుక్రవారం లావేరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖపై చర్చ జరిగిన సమయంలో లోపెంట గ్రామానికి చెందిన పైడిరాజు వ్యవసాయ పంపుసెట్‌కు విద్యుత్ కనెక్షన్‌కు కోసం దరఖాస్తు చేసి సంవత్సరాలు అవుతున్నా ఎందుకు మంజూరు చేయడం లేదని లోపెంట సర్పంచ్ విద్యుత్ ఏఈ రమణమూర్తిని నిలదీశారు. ఏఈ పనితీరు మార్చుకోవాలని జెడ్పీటీసీ, మండల ప్రజా ప్రతినిధులు అన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరుచేయాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. ఇజ్జాడపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల నియమించాలని గోవిందపురం సర్పంచ్ పిల్లా రాము కోరారు. జలజీవన్ మిషన్ ద్వారా మండలానికి రూ.44 కోట్లతో 144 పనులు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.శివబాబు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, హౌసింగ్ డీఈ అప్పారావు, సీఏ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.